కష్టాల కాజ్‌వేలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు


వీకే రాయపురంలో ఏలేరు కాలువలో శిథిలమైన కాజ్‌వే

సామర్లకోట: రెండు మార్గాలను కలిపేవే కాజ్‌వేలు.. అవి శిథిలమై రైతులకు ఇబ్బందిగా మారాయి. సామర్లకోట మండలం వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల్లో కాజ్‌వేలు శిథిలయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బోయనపూడిలో కాజ్‌వే సుమారు 22 ఏళ్ల కిందటే శిథిలమైంది. దాంతో ఆ గ్రామానికి చెందిన రైతులు వీకే రాయపురం గ్రామంలోని కాజ్‌వే మీదుగా పొలాలకు వెళ్లేవారు. అయితే వీకే రాయపురంలోని కాజ్‌వే ఇటీవల ఏలేరు కాలువ వరదలకు పూర్తిగా కొట్టుకుపోయింది. వరి పంట కోతకు రావడంతో పంట ఏవిధంగా ఇళ్లకు చేర్చుకోవాలో అర్థం కాక రైతులు మదనపడుతున్నారు. వీకే రాయపురం, బోయనపూడి గ్రామాలు గోదావరి కాలువ ఆవతలి వైపు ఉన్నాయి. ఆయా గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఏలేరు కాలువ ఆవలివైపు ఉన్నాయి. పొలాల్లోకి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు వెళ్లే విధంగా ఏలేరు కాలువలో కాజ్‌వేలను రెండు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. పొలాలకు వెళ్లడానికి ఏలేరు కాలువ నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. ఏలేరు కాలువ నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో వీకే రాయపురం వద్ద ఉన్న కాలిబాట వంతెన మీదుగా పొలాలకు వెళ్లి పశువులకు గడ్డి తీసుకు రావాల్సి వస్తుందని వివరిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఉపయోగ పడే విధంగా వంతెనలను నిర్మించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వ్యవసాయ క్షేత్రం మీదుగా రాకపోకలు

రెండు గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు ట్రాక్టర్లపై వెళ్లడానికి మార్గం లేక సామర్లకోటలో ఉన్న వ్యవసాయ క్షేత్రం మీదుగా ఏలేరు కాలువ గట్టు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దాంతో సుమారు 15 కిలోమీటర్లు తిరిగి పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. ధాన్యం తీసుకువచ్చే సమయంలో మరింత ఇబ్బందికరంగా ఉంటుందని అంటున్నారు. ఏలేరు కాలువ గట్టు మీదుగా రాకపోకలు సాగించే సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెను ప్రమాదాలు జరుగుతాయని వాపోతున్నారు.

మూడు పర్యాయాలు మరమ్మతులు



వీకే రాయపురం గ్రామానికి చెందిన రైతు సంఘం నుంచి ఏలేరు కాలువలోని కాజ్‌వేను మూడు పర్యాయాలు మరమ్మతులు చేశాం. సుమారు ఆరేళ్ల నుంచి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రైతు సంఘ నిధులు సుమారు రూ.నాలుగు లక్షల వరకు ఖర్చు చేశారు. ఏలేరు కాలువకు వరద వస్తే కాజ్‌వే కొట్టుకుపోతుంది. దాంతో వంతెన నిర్మాణం చేపట్టాలి.

– వెలమర్తి శ్రీనివాసు, విద్యా కమిటీ మాజీ చైర్మన్, వీకే రాయపురం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళతాం...



ఇటీవల వరుసగా వచ్చిన వరదల కారణంగా ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. వరి పంట కోతకు వస్తుంది. దాంతో కాజ్‌వేలకు తాత్కాలిక మరమ్మతుల కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళతాం. అచ్చంపేట నుంచి పెద్దాపురం ఏడీబీ రోడ్డు వరకు జాతీయ రహదారి పనులు చేస్తున్న కాంట్రాక్టరు వాహనాలు కాజ్‌వే మీదుగా వెళ్లాల్సి ఉంది. కాజ్‌వే సమస్యను కాంట్రాక్టరు దృష్టిలో ఉంచుతాం.

– గొల్లపల్లి సర్వేశ్వరరావు, సర్పంచ్, వీకే రాయపురం

ట్రాఫిక్‌తో ఇబ్బందులు


సామర్లకోట మఠం సెంటర్‌లో బారులు తీరిన వాహనాలు

సామర్లకోట: స్థానిక మంఠం సెంటర్‌లో సోమవారం ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ముఖ్య కూడలి కావడం, చిరు వ్యాపారస్తులు నాగుల చవితి పూజా సామగ్రిని రోడ్డు మార్జిన్‌లో అమ్మడంతో ఇరుకుగా మారింది. దాంతో వాటిని కొనుగోలు చేయడానికి జనం తరలిరావడం, వారి వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేయడంతో సోమవారం సాయంత్రం వివిధ బస్సుల ఆగిపోయి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. సామర్లకోట– పెద్దాపురం రోడ్డులోని మఠం సెంటర్‌కు బస్సు కాంప్లెక్స్ నుంచి ఆటోలు వస్తాయి. అదే విధంగా నాలుగు రోడ్ల కూడలి కూడలి కావడంతో ఆయా ప్రదేశాల నుంచి వాహనాలు రావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. తరచూ చిరు వ్యాపారస్తులు రోడ్డు మధ్యలో వివిధ తిను బండారాలు అమ్మడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రశాంతంగా మత్స్యకార సొసైటీ ఎన్నికలు


సామర్లకోట సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని మత్స్యకార సంఘ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఎఫ్‌డీఓ ప్రకాశారావు పర్యవేక్షణలో సామర్లకోట, వేట్లపాలెం, పీబీ దేవం, నవర సొసైటీలకు ఎన్నికలు జరిగాయని మత్స్యకార ఎఫ్‌డీఓ ప్రకాశరావు తెలిపారు. సామర్లకోట సంఘానికి ఆర్.నూకరాజు, వేట్లపాలెం సొసైటీకి వెంకటేష్, పీబీ దేవం సొసైటీకి సీహెచ్ ఉమామహేశ్వరరావు, నవర సొసైటీకి అనురాధా దేవిలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. నాలుగు సొసైటీలకు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. సామర్లకోట సొసైటీలో 219 మంది సభ్యులు ఉండగా, మారాటి అమ్మిరాజు అధ్యక్షుడిగా, గొర్రెల అప్పారావును కార్యదర్శిగా, అందుగుల జార్జి చక్రవర్తిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. పీబీ దేవం సొసైటీలో 109 మంది సభ్యులు ఉండగా అధ్యక్షుడిగా అడపా వెంకన్న, కార్యదర్శిగా ఆకుల మురళీ ఎన్నికయ్యారు. వేట్లపాలెం మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా కేశబోయిన లోవరాజు, కార్యదర్శిగా గుడాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బత్తిన శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సొసైటీలో 136 మంది సభ్యులు ఉన్నారు. 23 మంది సభ్యులు ఉన్న నవర సొసైటీ అధ్యక్షుడిగా జుత్తుక పుత్రయ్య, ఉపాధ్యక్షుడిగా కొప్పుశెట్టి గోవిందు, కార్యదర్శిగా పెంకే వెంకటరమణలు ఎన్నికైనట్లు ఎఫ్‌డీఓ ప్రకాశరావు వివరించారు. ఐదేళ్ల పాటు పదవీకాలం ఉండే కమిటీలకు ఎన్నికల అధికారులు ఎన్నికైన వారికి ధ్రువపత్రాలను అందజేశారు.

సమస్యల సత్వర పరిష్కారం

కాకినాడ: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ భావన పేర్కొన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్ ద్వారా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఫోన్‌లో 15 సమస్యలు వచ్చాయి. అనంతరం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 మంది నేరుగా ఫిర్యాదులు అందజేశారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

పాహిమాం.. పరమశివా

- కిటకిటలాడిన శివాలయాలు
- భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు


సామర్లకోటలో కుమారారామ భీమేశ్వరస్వామి


సామర్లకోట పంచారామ క్షేత్రంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పంచారామ క్షేత్రంలో బారులు తీరిన భక్తులు

సామర్లకోట: కార్తిక మాసం.. ఆపై సోమవారం కావడంతో శివాలయాలు కిటకిటలాడాయి.. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో కాలభైరవ స్వామి, ధ్వజస్తంభం, రావిచెట్టు, జమ్మి చెట్టు, తులసి చెట్ల వద్ద ఆలయ ప్రాంగణంలో భక్తులు ఉదయం, రాత్రి దీపాలు వెలిగించారు. తొలి సోమవారం కావడంతో అనేక మంది ఉపవాస దీక్షలు చేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈఓ భళ్ల నీలకంఠం ఏర్పాట్లను పర్యవేక్షించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి భక్తులు ఆయా క్యూలో వేచి ఉన్నారు. గోవును ఆలయం చుట్టూ తిప్పి గోపూజ తర్వాత స్వామివారికి తొలిపూజ, అభిషకాలు చేశారు. శివమాల, అయ్యప్ప మాల ధరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ధ్వజస్తంభం సమీపంలో శివలింగానికి స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దాపురం అగ్నిమాపక కేంద్రాల ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ ఒక్కరోజే 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఈఓ నీలకంఠం తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు చల్లా సత్తిబాబు, మలిరెడ్డి శ్రీను భక్తులకు సేవలందించారు. అదే విధంగా స్థానిక ఐదు తూముల వద్ద వేంచేసి యున్న అన్నపూర్ణా సమేత వేణుగోపాలస్వామి, చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి, పాత సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.


ఉప్పాడలో ఉన్న చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న పండితులు


చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకున్న భక్తులు

కిటకిటలాడిన శివాలయాలు

పెద్దాపురం: కార్తిక సోమవారం కావడంతో పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.
పెద్దాపురం విశ్వేశ్వర, చంద్రశేఖర స్వామివార్ల ఆలయాలు, ఆయా శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.


దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: మండల పరిధిలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక బాల త్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామి, రుక్మిణీ సత్యబామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం, ఉప్పాడలో ఉన్న చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశా. మహిళలు రావిచెట్టు, ధ్వజస్తంభాల వద్ద దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లిలో ఉన్న రుక్మిణి సత్యబామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మహిళలు విష్ణుపారాయణ చేశారు.

శివోహం

- మార్మోగిన శైవక్షేత్రాలు
- కిటకిటలాడిన ఆలయాలు
- తొలి కార్తిక సోమవారం భక్తుల సందడి


పాదగయ క్షేత్రంలో కార్తీక దీపాలు వదులుతున్న భక్తులు

పిఠాపురం: కార్తిక మాసం మొదటి సోమవారం స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయం చేరుకుని పాదగయలో పుణ్యస్నానాలు చేసి ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. పాదగయ పుష్కరిణి నీటితో పాదగయ క్షేత్రంలో శివ లింగాలకు భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. కార్తిక సోమవారం సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దేవాదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. సాయంతం స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో వివిధ గ్రామాల్లో ఉన్న శివాలయాలు శివన్నామస్మరణతో మారుమోగగా భక్తులు పోటెత్తారు.


పాదగయ పుష్కరిణిలో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు


కార్తిక సోమవారం సందర్భంగా పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


కార్తిక సోమవారం సందర్భంగా పాదగయ క్షేత్రం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పాదగయకు పోటెత్తిన శివ భక్తులు

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్


అర్జీని స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు

పెద్దాపురం: సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ కేవీ మాధవరావు అన్నారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు తొమ్మిది అర్జీలు అందాయన్నారు. కార్యాలయ డీటీ భానుకుమార్, చప్పిడి రాజు, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ ఏఈ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శకుంతలాదేవి సేవలు ఆదర్శనీయం


శకుంతలాదేవి జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సాయిరామకృష్ణ

సామర్లకోట: హ్యూమన్ కంప్యూటర్‌గా పేరు పొందిన శకుంతలదేవిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. శకుంతలాదేవి జయంతి సందర్భంగా స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంలో మెలకువలు, సులువుగా గణన పద్ధతులను వివరించారు. లెక్కల్లో పట్టు సాధించడం ద్వారా తమ జీవితాలను చక్కదిద్దుకోవచ్చని వివరించారు. గణిత ఉపాధ్యాయుడు డీవీఆర్ఎన్ వల్లి, ఎ.శ్రీవల్లి పాల్గొని శకుంతలాదేవి జీవిత విశేషాలను వివరించారు.

పీఆర్‌జీ ప్రిన్సిపాల్‌పై విచారణ

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం కళాశాలలో ఆర్‌జేడీ శోభారాణి విచారణ చేపట్టారు. కళాశాలలకు చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు కళాశాలలో పరీక్ష విభాగంలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ విద్యాకమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



సామర్లకోట: స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో జ్యోతిర్లింగార్చన ఆకట్టుకుంది. ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్న వారికి ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. అలాగే సాయంత్రం బిల్వార్చన పూజలు చేశారు. ఇందులో భాగంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

నాగుల చవితికి సిద్ధం


సామర్లకోట మఠం సెంటర్‌లో బుర్రగుంజు కొనుగోలు చేస్తున్న భక్తులు

సామర్లకోట: నాగుల చవితిని మంగళవారం ఘనంగా జరుపుకొనేందుకు భక్తులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. తాటి బుర్రగుంజు, నువ్వులు, ఆవు పాలు, కోడిగుడ్లు, చలివిడి రెడీ చేశారు. సోమవారం పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్ రద్దీగా మారింది. మంగళవారం పుట్టల వద్ద పూజలు చేసేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం, టీటీడీ, ఏడీబీ రోడ్డు పొలాల్లో పుట్టలు ఎక్కువగా ఉండేవి. అయితే ఆయా ప్రదేశాలను శుభ్రం చేయడంతో పుట్టలను తొలగించారు. దాంతో కొంత మంది రెడీమేడ్ పుట్టలను ఏర్పాటు చేస్తున్నారు.

నిబంధనలు పాటించాలి


ప్రైవేట్ ఆసుపత్రి వద్ద మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ సరిత

పెద్దాపురం: ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని పెద్దాపురం అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత అన్నారు. పట్టణంలో పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో సోమవారం ఆమె సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇబ్బందులు తలెత్తినా, నిబంధనలు పాటించకున్నా శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో శ్రీనివాసా హాస్పిటల్, ఆదీష్, విజయలక్ష్మి ఆసుపత్రి తదితర ఆసుపత్రిల్లో తనిఖీలు నిర్వహించారు. డాక్టర్ అనూషరాయ్, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం పరిధిలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న 11 జిల్లాలోని అధికారులకు మంగళవారం నుంచి అభివృద్ధి ప్రణాళికల తయారీపై టీఓటీ ఉంటుందని శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళ, బుధవారాల్లో ఒక బ్యాచ్, ఏడు, 8 తేదీల్లో రెండో బ్యాచ్‌లో టీఓటీలకు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ పొందిన టీఓటీలు ఈ నెల 12 నుంచి 16 వరకూ ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, లైన్‌డిపార్టుమెంట్ ఉద్యోగులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు రాబట్టడానికి అభివృద్ధి ప్రణాళికలు ఎంతగానో దోహదపడతాయన్నారు. దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని శిక్షణ పొందాలన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం


హుస్సేన్‌పురంలో వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట: నియోజకవర్గంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. హుస్సేన్‌పురంలో రూ.27.23 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకు, పైపులైన్, పబ్లిక్ కుళాయిలను ఆయన ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మార్ని నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు కోట వెంకటలక్ష్మి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, సొసైటీ మాజీ అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసు, గ్రామ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, మార్ని వీర్రాజు, తలారి శ్రీను, పలివెల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.